క్లుప్తంగా

అమ్మకానికి సిద్ధంగా గణేశ్ ప్రతిమలు

కెరమెరి: వినాయక చవితి పురస్కరించుకొని మండల కేంద్రంలో వినాయక విగ్రహాలు అమ్మకానికి సిద్ధమయ్యాయి. పండుగకు రెండు రోజులే గడువు ఉండడంతో శనివారం పెద్ద ఎత్తున భక్తులు విగ్రహాలు కొనుగోలు చేశారు.

మట్టి విగ్రహాల పంపిణీ

మండలంలోని 31 గ్రామ పంచాయతీల గ్రామ కార్యదర్శులకు 31 గణపతి మట్టి విగ్రహాలను ఎంపీడీవో మహేందర్ శనివారం పంపిణీ చేశారు. వినాయక చవితి పర్వదినాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ప్రసాద్, సుధాకర్ రెడ్డి ఉన్నారు.

న్యూట్రీగార్డెన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మహేందర్

కెరమెరి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో స్థలం ఉన్న చోట న్యూట్రీగార్డెన్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం టీఏ, ఎఫ్ఏలకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హార్టికల్చర్ మొక్కల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో నగేశ్, ఈసీ అక్యానాయక్ ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీడీవో

దహెగాం: ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ కంబగౌని సులోచన అధ్యక్షతన శనివారం నిర్వహించాల్సిన సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

మిర్చి పంటల పరిశీలన



మిర్చి పంట పరిశీలిస్తున్న ఏడీఏ

దహెగాం: మండలంలోని లగ్గాం, ఒడ్డుగూడ గ్రామాల్లో సాగవుతున్న మిర్చి పంటను శనివారం ఏడీఏ రాజులనాయుడు, హార్టికల్చర్ అధికారి శాంతిప్రియలు పరిశీలించారు. ఈ సందర్భంగా మిర్చి పంటలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలపై వివరించారు. రైతులు ఎప్పటికప్పుడు పంటల మార్పిడి చేయాలన్నారు. ఉద్యానవన పంటలు పండిస్తే లాభాలు వస్తాయన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలని సూచించారు. ఏవో వంశీక్రిష్ణ, రైతులు ఉన్నారు.

మారుమూల గ్రామాల అభివృద్ధే ధ్యేయం



ఎమ్మెల్యేను కలిసిన వివిధ గ్రామాల ప్రజలు

ఆసిఫాబాద్ అర్బన్: జిల్లాలోని మారుమూల గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాదిగూడ మండలం అర్జుని, పిప్రి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల ప్రజలు సక్కును కలిశారు. ఆయా గ్రామాలకు బీటీ రోడ్లు, వంతెనలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేని సన్మానించారు.

'ఎంటీఎస్ ఇప్పించేందుకు కృషి'

కెరమెరి: సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎంటీఎస్ (మినిమం టైమ్ స్కేల్) ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలకు చెందిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆయన ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పీఆర్టీయూ అన్ని విధాల సహకారాలు అందిస్తుందన్నారు.

వినాయకుడు ముస్తాబు!

- ఉపాధి కల్పిస్తున్న విగ్రహాల తయారీ
- జిల్లాలో తయారవుతున్న ప్రతిమలు
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు
- మట్టి విగ్రహాలకు పెరిగిన గిరాకీ



చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్‌లో మట్టి విగ్రహాలు తయారు చేస్తున్న కళాకారుడు



కౌటాలలో తయారవుతున్న గణేశ్ విగ్రహాలు

చింతలమానెపల్లి: గణేశ్ ఉత్సవాల నిర్వహణకు జిల్లావాసులు సిద్ధమవుతున్నారు. ఈనెల 18న వినాయక చవితిని అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల నిర్వహణలో కీలకమైన విగ్రహాల ఎంపికలో నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు రెండు వేలకు పైగా భారీ విగ్రహాలు విక్రయిస్తారని అంచనా. ఈ సందర్భంగా వినాయకుడి విగ్రహాలను ఆకట్టుకునేలా, కళాత్మకత ఉట్టిపడేలా తయారీదారులు రూపొందిస్తున్నారు.

జిల్లాలో విగ్రహాల తయారీ..

జిల్లాలోని కాగజ్‌నగర్, కౌటాలలో గణేశ్ విగ్రహాలు తయారు చేస్తున్నారు. కాగజ్‌నగర్‌లో ఆరు తయారీ కేంద్రాలు ఉండగా, కౌటాలలో ఒక కేంద్రం ఉంది. దీంతో పాటు ఆయా గ్రామాలలో కుమ్మరి కులస్తులు మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి కళాకారులు వచ్చి విగ్రహాల తయారీ నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లో విగ్రహాల తయారీ కేంద్రాలు లేకున్నా ఇతర ప్రాంతాల నుంచి విగ్రహాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, తెలంగాణలోని కోరుట్ల, గోదావరిఖని, మంచిర్యాల, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి టోకుగా విగ్రహాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

ఉపాధి పొందుతున్న కళాకారులు..

జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మందికి పైగా ఉత్సవ విగ్రహాల తయారీలో ఉపాధి పొందుతున్నారు. విగ్రహాల తయారీ, రంగులు అద్దడం, మెరుగులు దిద్దడం ద్వారా కళాకారులకు ఉపాధి లభిస్తోంది. గ్రామాలలో మట్టి విగ్రహాలకు గిరాకీ పెరగడంతో తమకు కొంత ఉపాధి లభిస్తోందని కుమ్మరి వృత్తులకు చెందిన కళాకారులు పేర్కొంటున్నారు. పెయింటింగ్ వేసే కళాకారులు సైతం వినాయక విగ్రహాల తయారీ ద్వారా ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం ఆయా శాఖల ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణతో నాణ్యమైన విగ్రహాలు తయారు చేస్తున్నామని గ్రామీణ కళాకారులు తెలియజేస్తున్నారు.

పెరిగిన ముడిసరుకుల ధరలు.

విగ్రహాల తయారీలో ఆధునిక పరిజ్ఞానం వినియోగిస్తున్నప్పటికీ ముడిసరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు పెరిగాయి. ముడి సరుకుల రవాణా, విగ్రహాలకు అదనపు హంగులు, విగ్రహాల ధరలు పెరగడానికి కారణమవుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో పండుగకు ఏర్పాటు చేసే విగ్రహాల ధరలు వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. గిరాకీ ఉన్నా పెరిగిన ముడిసరుకుల ధరలతో ఆదాయం తగ్గుతోందని విగ్రహాల తయారీదారులు వాపోతున్నారు. వందల మందికి ఉపాధి కల్పించే వినాయక విగ్రహాల తయారీని ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరుతున్నారు.

మూడు నెలలు పని చేస్తాం



వినాయక విగ్రహాల తయారీ కోసం సిద్దిపేట నుంచి ఇక్కడికి వచ్చాం. పెయింటింగ్ పని చేసే మాకు మూడు నెలలపాటు విగ్రహాలకు రంగులు వేసే పని ఉంటుంది. మా కళకు గుర్తింపు లేకున్నా గణేశుడి విగ్రహాలకు రంగులు వేసి ఆదాయం పొందుతున్నాం.

– బల్లె ఉదయ్ కుమార్, తయారీదారుడు

ప్రభుత్వం ప్రోత్సహించాలి



కుమ్మరి కళాకారులకు ప్రభుత్వం విగ్రహాల తయారీలో శిక్షణ నిర్వహించింది. విగ్రహాల తయారీని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– తాళ్లపల్లి శ్రీనివాస్, చింతలమానెపల్లి

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా వర్కర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆశా వర్కర్లు తమ డిమాండ్ల సాధనకు ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. శనివారం సమ్మెకు సంబంధించిన నోటీసును ఆశా వర్కర్లతో కలిసి జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేశారు. నాయకులు శ్రీకాంత్, ఆశా వర్కర్లు పంచశీల, శోభ, మాధవి, కవిత, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



నివాళులర్పిస్తున్న కోవ లక్ష్మి

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రామడుగుల శంకర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శంకర్ తల్లి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి



మట్టిగణపతులతో కలెక్టర్, ప్రజా ప్రతినిధులు

ఆసిఫాబాద్: వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణం కలుషితమవుతుందని, నివారణ దిశగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు. కాలుష్య నివారణ సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మట్టిగణపతుల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రమాదేవి, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, అజయ్‌కుమార్, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్‌విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెబ్బెన: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీ వద్ద శనివారం సింగరేణి ఉద్యోగులకు, ప్రజలకు బెల్లంపల్లి ఏరియా ఆధ్వర్యంలో మట్టి గణపతుల విగ్రహాలు ఉచితంగా అందజేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్‌వోటూజీఎం నరేందర్, పీవో సత్యనారాయణ, ఉమాకాంత్, డీజీఎం సతీష్‌బాబు, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్ పాల్గొన్నారు.

కౌటాల: మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కౌటాల సర్పంచ్ వొజ్జల మౌనిశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వాహని పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేశారు. గ్రామాల్లో మట్టి వినాయకులు ప్రతిష్ఠించాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు.

గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో వినాయక మండప నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు కచ్చితంగా పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, నిబంధనలు అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, పట్టణ సీఐ బుద్ధస్వామి, రూరల్ సీఐ నాగరాజు, ఎస్సైలు చంద్రశేఖర్, సోనియా, శ్రీకాంత్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట చరిత్ర పుస్తకాల్లో చేర్చాలి

రెబ్బెన: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలోని కేఎల్ మహేంద్ర భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. పట్టణ కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సయ్య, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రహీం, మండల అధ్యక్షుడు రవికుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి సాయి, మండల అధ్యక్షుడు సాయి, మండల కార్యదర్శి బాలు నాయక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం



నిరసన తెలుపుతున్న భగీరథ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా నెరవేర్చాలని లేకుంటే సమ్మె ఉధృతం చేస్తామని కార్మిక సంఘం జేఏసీ నాయకులు లింగయ్య, ఉపేందర్, లోకేష్‌లు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన నిరవధిక సమ్మె శనివారం 15వ రోజుకు చేరింది. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. దివాకర్, తిరుపతి, బాలేష్, సురేశ్, వెంకటేష్, అంబాజీరావు, ఈశ్వర్, సంతోష్, తాజ్, సునీల్, అశోక్, సోహెల్, పురుషోత్తం, శ్రీకాంత్, అనిల్, రవీందర్, వేణు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు



సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన 15 గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 2 వేల జనాభా కలిగిన జీపీలో ఆసిఫాబాద్ మండలం అడ, చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ –2, జైనూర్ మండలం మార్లవాయి, కాగజ్‌నగర్‌లోని దుర్గనగర్, రెబ్బెన మండలం కొండపల్లి, వాంకిడి మండలం జైత్‌పూర్, 2 నుంచి 5 వేల జనాభా కలిగిన జీపీల్లో కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం, సిర్పూర్(టి) మండలం వేంపల్లి, వాంకిడి మండలం ఇందాని, 5 వేలకుపైగా జనాభా కలిగిన జీపీల్లో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్, రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్, సిర్పూర్(టి) మండలం వాంకిడి గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని జీపీల అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు. అవార్డులకు ఎంపికైన పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలను శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, వైద్యాధికారి అజయ్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీల నిరసన



దహెగాం: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

దహెగాం: న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 6వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. అంగన్‌వాడీలు విజయలక్ష్మి, మమత, పార్వతి, రూప, ఈశ్వరి, పద్మ, కల్పన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం అంగన్‌వాడీలు, హెల్పర్లు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారానికి వారు చేపట్టిన సమ్మె శనివారం ఆరోరోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు కవిత, లింగుబాయి, స్రవంతి, అనసూయ, గుణసుందరి, మంజుల, అనిత, సావిత్రి, రాధా, చంద్రకళ, సరోజా, లూర్దమేరి, అమలేశ్వరి, తాయిబాయి, హెల్పర్లు రజిత, సుమిత్ర, రేణుక, జనాబాయి, బూదేవి ఉన్నారు.

తిర్యాణి: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అనిల్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు శనివారం మద్దతు తెలిపారు. మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, యువజన సంఘం మండల అధ్యక్షుడు పున్నం హరీశ్‌కుమార్, నాయకులు వెంకటేశ్ గౌడ్, అమర్, సురేశ్, సాయి, కిరణ్ తదితరులు ఉన్నారు.

వంటావార్పుతో నిరసన

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్ ఎదుట ప్రారంభించిన నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ వేతనాలు చెల్లించాలన్నారు. నాయకులు బోగె ఉపేందర్, లోకేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వనిత, పద్మ, సరళ, అంజలి, ధనలక్ష్మి, మంజుల, సులోచన, అరుణ, సువర్ణ, మమత తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: అంగన్‌వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీర ఆత్మారాం నాయక్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న సమ్మె శనివారం 6వ రోజుకు చేరుకోగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. బీజేపీ నాయకులు ఇగురపు సంజీవ్, డొంగ్రి కిషోర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదు

ప్రభుత్వ బెదిరింపులకు ఏమాత్రం భయపడేది లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. శనివారం అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్ష శిబిరం వద్ద మాట్లాడారు.

బెజ్జూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి శనివారం బీజేపీ, బీఎస్పీ పార్టీల మండల అధ్యక్షులు ఉమ్మెర బాలకృష్ణ, ఆత్రం సాయిలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

సిర్పూర్(టి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల వరకు ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 23న మంచిర్యాల జిల్లా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, లక్సెట్టిపేటలో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా డీసీవో బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశంసా పత్రం అందుకున్న ఎస్సై

సిర్పూర్(టి): సిర్పూర్(టి) కోర్టు పరిధిలోని పోలీసుస్టేషన్లలోని కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించేందుకు అత్యంత ప్రతిభ కనబర్చినందున సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్‌ను శనివారం ఎస్పీ సురేశ్‌కుమార్ అభినందించారు. ఈమేరకు ప్రశంసా పత్రం అందజేశారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా వైద్యాధికారి (ఆయూష్, యునానీ) పోస్టుల నియామకానికి ఒప్పంద ప్రాతిపదికన అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి తుకారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 19 నుంచి 29 వరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ జామా మసీద్ ఆవరణలో మసీద్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఓటు నమోదు స్పెషల్ డ్రైవ్‌ను శనివారం కమిటీ అధ్యక్షుడు ఫయాజ్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహమాన్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఉచిత ఆన్‌లైన్ ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాలాం సాజిద్, అహ్మద్, సోజర్, జమీర్, ఇమ్రాన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

రెబ్బెన: మండలంలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో శనివారం షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ అత్యవసర సమయంలో బాధితులు 100కు ఫోన్ చేసి సత్వర సహాయం పొందవచ్చన్నారు. గోలేటి సర్పంచ్ సుమలత, ఉపాధ్యాయులు హన్మంతు, పీఈటీ భాస్కర్, షీటీం సభ్యులు స్వప్న, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌సాగర్ రావుకు ఘన స్వాగతం

ఆసిఫాబాద్: మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా టీపీసీసీ సభ్యుడు డాక్టర్ గణేశ్ రాథోడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయనను శాలువలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. మోతుగూడ నుంచి ఆసిఫాబాద్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ కో ఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, ఆసిఫాబాద్ ఆసెంబ్లీ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సోమయ్య, సత్తయ్య, బాబు, పఠాన్ పాల్గొన్నారు.

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

రెబ్బెన: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని గ్రామాల్లో గణేశ్ మండపాల ఏర్పాటుకు భక్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సీఐ అల్లం నరేందర్ అన్నారు. శనివారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపం అనుమతి కోసం నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

కెరమెరి: కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మర్సకోల సరస్వతి అన్నారు. శనివారం మండలంలోని పాటాగూడ, టోకెన్‌మోవాడ్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కుసుంబ్‌రావు, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శంకర్, గౌసు, శ్యాంరావు, మురళి, అంబూ, తదితరులు ఉన్నారు.

నేడు బైక్ ర్యాలీ

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి స్వచ్ఛతాహీ సేవా నినాదంతో శనివారం మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, పాలకవర్గ సభ్యులు, అధికారులు స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సభ్యులు పాల్గొన్నారు.

నూతన భవనం నిర్మించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ అన్నారు. శనివారం మండలంలోని జెండగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు హరీశ్, రవికిరణ్, జీవన్ ఉన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌జామ్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడ్డారు. స్థానిక కాపువాడలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మరమ్మతుల నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు బ్రిడ్జిపైకి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి తుకారాం సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఒడ్డపల్లి గార్డెన్స్‌లో ఆశా వర్కర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్యుపరంగా వచ్చే వ్యాధులు, అంటువ్యాధులను గుర్తించి అవసరమైన చికిత్స అందించాలన్నారు. వ్యాధి రహిత జిల్లాగా రూపొందించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ప్రోగ్రామ్ అధికారి వినోద్, పాల్గొన్నారు.

సీఐకి ప్రశంస

కౌటాల: జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేందుకు కృషి చేసిన సీఐ సాధిక్ పాషా జిల్లా కేంద్రంలో శనివారం ఎస్పీ సురేశ్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.